

పెద్దపల్లి టౌన్: ప్రభుత్వ డాక్టర్ల బృందాన్ని అభినందింస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మే 1 నుంచి వేసవి శిక్షణ క్యాంపులు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 26: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు గానూ యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు యువజన క్రీడలశాఖ చైర్మన్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి, పీడీ సురేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అంతర్గాంలో ఫుట్‌బాల్, దొంగతుర్తిలో ఫుట్‌బాల్, ధర్మారం మండలం నందిమేడారంలో వాలీబాల్, జూలపల్లిలో వాలీబాల్, కనగర్తిలో బాక్సింగ్, కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లిలో అథ్లెటిక్స్, పెద్దపల్లి మండలం నిట్టూరులో ఖోఖో, సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో వాలీబాల్, జూలపల్లి మండలం తేలుకుంటలో తైక్వాండో, పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో హ్యాండ్ బాల్, అర్బన్1లో ఖోఖో, 8 ఇంక్లైన్ కాలనీ అబ్దుల్‌కలాంస్టేడియం2లో ఫుట్‌బాల్, 8 ఇంక్లైన్ కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియం-3లో లాన్‌టెన్నిస్, మంథనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖోఖో, పెద్దపల్లి ట్రినిటీ ప్రైమరీ పాఠశాలలో వాలీబాల్, సుల్తానాబాద్‌లో ఖోఖో పోటీల శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ఆసక్తి ఉన్న 14 ఏండ్ల లోపు బాల బాలికలు శిక్షణ కోసం తమ పేర్లను ఆన్‌లైన్‌లో (http://satgasc.telangana.gov.in) నమోదు చేసుకోవాలన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

పెద్దపల్లి, ఏప్రిల్ 26: సుల్తానాబాద్ పట్టణంలో చేపట్టిన డబుల్ రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని అభివృద్ధి పనులపై సమీక్షించారు.సమావేశంలో రోడ్లు భవనాలశాఖ ఈఈ భావ్ సింగ్, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ నిహాజ్, తదితరులు పాల్గొన్నారు.

భూమి భద్రతకు కోసం భూ భారతి

ప్రతి రైతుకు భూ భద్రత కల్పించే దిశగా ప్రభుత్వంఆర్వోఆర్, భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. భూభారతి చట్టంలోని అంశాలను రైతులు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు బేసిమెంట్ పూర్తి చేసుకున్న నిమ్మనపల్లి కి చెందిన తూముల శ్రీనివాస్‌కు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. సమావేశంలో పెద్దపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, హౌసింగ్ పీడీ రాజేశ్వర్, తహసీల్దార్ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్లకు కలెక్టర్ అభినందన

పెద్దపల్లి టౌన్, ఏప్రిల్26: క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వ డాక్టర్లను కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం కలెక్టరేట్‌లో అభినందించారు. ప్రభుత్వ దవాఖానలో ప్రజలకు అందుతున్న మెరుగైన వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో శుక్రవారం పట్టణానికి చెందిన ఓ మహిళ అడ్మిట్ అయింది. దీంతో వైద్యులు పరీక్షలు నిర్వహించి, లాప్రోస్కాపిక్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేశారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ దవాఖాన డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అమరసింహారెడ్డి, డాక్టర్ సాయిప్రసన్న, డాక్టర్ స్వాతి, డాక్టర్ భవానీ బృందానికి అభినందనలు తెలిపారు.

అధిక ఉష్ణోగ్రతలు నమోదు

పెద్దపల్లి, ఏప్రిల్ 26: జిల్లాలో ఈ నెల 27నుంచి30 వరకు అధిక ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం ఉందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 27న తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందన్నారు. ఉష్ణోగ్రతలు 36-40 డిగ్రీల వరకు నమోదయ్య అవకాశం ఉందన్నారు. 28-30వరకు వాతావరణ శాఖ అంచనా ప్రకారం 41-44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావొచ్చన్నారు. వడగాల్పులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఇందిరమ్మ ఇండ్లల్లో అవినీతిని సహించేది లేదు

జూలపల్లి: కోనరావుపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, ఏప్రిల్ 26: ఇందిరమ్మ ఇండ్లల్లో అవినీతికి పాల్పడితే సహించేది లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో ₹60లక్షలతో కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లు, రెండు ట్రాలీలు, అలాగే రూ.375లక్షలతో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘానికి అందించిన ఆటోతోపాటు స్కూల్ డ్రెస్‌ల మేకింగ్ సెంటర్‌ను శనివారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. త్వరలోనే గట్టెపల్లి మానేరు వాగు నుంచి సుల్తానాబాద్‌కు కొత్త పైప్‌లైన్‌తో పాటు మంచినీటి ట్యాంకులను నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్, నాయకులు ఉన్నారు.

ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 26: పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణారావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో శనివారం పెద్దపల్లి మండలం, పట్టణానికి చెందిన 200మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 259మందికి రూ.84.77లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఇక్కడ ఏఎంసీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప-సురేందర్, తహసీల్దార్ రాజయ్యయాదవ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జూలపల్లి, ఏప్రిల్ 26: మండల కేంద్రంతోపాటు కోనరావుపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు శనివారం ప్రారంభించారు. అలాగే మండల కేంద్రంలోని 'ఏ1 గోల్డెన్ ఫంక్షన్ హాల్'లో 66 మంది లబ్ధిదారులకు రూ.66లక్షల పైచిలుకు విలువైన కల్యాణలక్ష్మి చెక్కులు, 84 మందికి ₹20లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఇక్కడ ధూళికట్ట పీఏసీఎస్ చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, తహసీల్దార్ స్వర్ణ, ఏవో ప్రత్యూష, మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు దారబోయిన నరసింహంయాదవ్, దండె వెంకటేశం, నాయకులు , తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలపై

రాజీలేని పోరాటం

గోదావరిఖని, ఏప్రిల్ 26: సింగరేణి గని కార్మికుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ పోరాట ఫలితంగానే యాజమాన్యం స్థానికంగా పలు సమస్యల పరిష్కారం లభించిందన్నారు. సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు కోసం ఇది వరకే అమరణ నిరాహార దీక్ష చేసిన తాము సాధించేవరకు పోరాడుతామన్నారు. తమ పోరాటంతోనే యాజమాన్యం ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసిందని, గ్రావిటీ ఫిల్టర్ బెడ్, మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నట్లు తెలిపారు. స్థానిక సింగరేణి దవాఖానలో వ్యాధుల నిర్ధారణకు కొత్త పరికరాలు, గుండె వ్యాధుల నిర్ధారణ కోసం వార్డుల నిర్మాణం చేపట్టామన్నారు. సింగరేణి వ్యాప్తంగా సీబీఎస్ పాఠశాలలు ఏర్పాటు కావాలన్నారు. బస్తీబాటలో భాగం గా ఐబీ కాలనీలో రోడ్ల నిర్మాణం, కార్మికుల రోడ్లకు మరమ్మతులు జరిగాయన్నారు. ఇక్కడ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మేదరి సారయ్య, ఆర్జీ-1 అధ్యక్ష, కార్యదర్శులు ఆరెల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, సానం రవి, దాసరి సురేశ్, రమేశ్, ప్రభాకర్, రాజేందర్, దశరథరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

- పీవీ బ్రిడ్జికి రిపేరు చేయించలేని దుస్థితి
- ఏడాదిన్నర కావొస్తున్నా ఓడేడ్ వంతెనకు తట్టెడు మట్టి తీయలే
- అవసరం లేనిచోట రూ.300కోట్లతో బ్రిడ్జి మంజూరు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

తండ్రీకొడుకుల హయాంలో

ఒక్క బ్రిడ్జి కట్టలే..

మంథని రూరల్, ఏప్రిల్ 26: మంథని నియోజకవర్గాన్ని 40ఏండ్లు పరిపాలన చేసిన తండ్రీకొడుకుల హయాంలో ఒక్క బ్రిడ్జి నిర్మాణం చేయలేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. మంథని మండలం అడవిసోమన్‌పల్లి సమీపంలోని మానేరు బ్రిడ్జి మరమ్మతు పనులను శనివారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. ఆనాడు స్వర్గీయ పీవీ నర్సింహారావు మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అడవిసోమన్‌పల్లి మానేరుపై వంతెన నిర్మించారన్నారు. అటు తర్వాత అధికారంలోకి వచ్చిన తండ్రీకొడుకులు ఒక్క వంతెనను తీసుకురాలేదన్నారు. మళ్లీ బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో తాను ఖమ్మంపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాగా, ఓడేడ్‌లో నిర్మాణంలో ఉందన్నారు. తండ్రీకొడుకుల పాలనలో ఒక్క బ్రిడ్జి కట్టలేదంటే.. పేరు కోసం తన సామాజికవర్గానికి చెందిన వ్యక్తి రియల్ ఎస్టేట్ కోసం రూ.300కోట్లతో అవసరం లేనిచోట బ్రిడ్జిని తీసుకువచ్చారన్నారు. ఆ రూ.300కోట్లతో మంథని మండలం ఆరెందమానేరు లేకపోతే అడవిసోమన్‌పల్లి వద్ద మరో బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమన్‌పల్లి బ్రిడ్జి దయనీయ స్థితిలో ఉండడం విడ్డూరమని, కనీసం మరమ్మతులు చేయించలేని దుస్థితిలో మంత్రి ఉన్నాడని ఎద్దేవా చేశారు. మంత్రి పదవి వస్తే ఎంతో అభివృద్ధి జరుగుతుందని, అనేక ప్రయోజనాలు ఉంటాయనుకుంటే చీకట్లోకే నెట్టివేస్తున్నారన్నారు. సోమన్‌పల్లి బ్రిడ్జికి రిపేరు చేయకపోగా ఓడేడు బ్రిడ్జి వద్దకు వెళ్లి పనుల్లో నాణ్యతపై విచారణ చేయిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మాట్లాడిన మంత్రి ఏడాదిన్నర కావొస్తున్నా గడుస్తున్న తట్టెడు మట్టి తీయలేదని విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇప్పటి వరకు ప్రణాళిక చెప్పకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా అడవిసోమన్‌పల్లి బ్రిడ్జి మరమ్మతు పనులను పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు తగరం శంకర్‌లాల్, రాజుగౌడ్, కనవే శ్రీనివాస్‌యాదవ్, కొండ రవీందర్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' అంతా మోసం

రామగిరి, ఏప్రిల్26: ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సమాజాన్ని విస్మరించి, మోసం చేస్తూనే ఉందని మంథని మాజీ ఎమ్మె ల్యే పుట్ట మధూకర్ ధ్వజమెత్తారు. వారం రోజులుగా సెంటినరీకాలనీలోని మంథని జేఎన్‌టీయూ కళాశాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమ హక్కుల కోసం చేస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలుపుతూ శనివారం దీక్ష శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. జేఎన్‌టీయూలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ల న్యాయబద్ధమైన కోర్కెలు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోను నమ్మి ఉద్యోగులు, ప్రజలు అవకాశం ఇచ్చారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. మేనిపెస్టోలో పెట్టినవి ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు చేయలేదని, తమ హక్కుల కోసం అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళన చేస్తుంటే.. కళాశాలలో విద్యార్థులు ఖాళీగా ఉంటున్నారని వారి భవిష్యత్ గురించి ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని హితవుపలికారు. ముఖ్యమంత్రి పక్కనే ఉంటున్న మంథని ఎమ్మెల్యే ఒక విద్యావంతుడిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యపై స్పందించాలని డిమాండ్ చేశారు. వీరి దీక్షకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శెంకేసి రవీందర్, పూదరి సత్యనారాయణ, కాపురబోయిన భాస్కర్, మాచిడి రాజు గౌడ్, తగరం శంకర్ లాల్, బొంకూరి పోచం, దామెర శ్రీనివాస్, రొడ్డ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అడవిసోమన్‌పల్లి సమీపంలో మానేరు బ్రిడ్జి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, నాయకులు

ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించండి

- పలువురికి అపరిచితుడి ఫోన్?

కోల్‌సిటీ, ఏప్రిల్ 26: 'హలో.. మేము మున్సిపల్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ షాపునకు సంబంధించిన డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ చెల్లించాలి. లేదంటే చట్ట ప్రకారం మీ దుకాణం సీజ్ చేయాల్సి ఉంటుంది. ఈ నంబర్‌కు ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా చెల్లిస్తే.. మా సిబ్బంది షాపు వద్దకు వచ్చి రసీదు ఇస్తారు' అంటూ మరోసారి అపరిచితుడు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలువురు వ్యాపారులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. గతంలో సైతం ఇదే అపరిచితుడు తాను మున్సిపల్ కమిషనర్ అంటూ గోదావరిఖనిలోని పలువురు వ్యాపారులకు ఫోన్ చేయడంతో పలువురు అతడి వలలో పడి మోసపోయారు. తర్వాత అపరిచితుడి బండారం బయటపడడంతో అంతా అప్రమత్తమయ్యారు. తాజాగా వారం నుంచి రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు దుకాణాల యజమానులకు మళ్లీ అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. ఈ విషయమై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ (ఎఫ్ఏసీ) కమిషనర్ మాట్లాడుతూ, కొద్దిరోజులుగా డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ పేరిట గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికివచ్చిందన్నారు. అలాంటి కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ పొందే సౌలభ్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు. వివరాల కోసం నగరపాలక కార్యాలయంలో లేదా ఫోన్‌నంబర్ (9966626680)లో సంప్రదించాలని సూచించారు. ఈ విషయమై గోదావరిఖని ఏసీపీ రమేశ్‌కు ఫిర్యాదు చేయగా, వారు కేసు దర్యాప్తు చేస్తున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు.

లక్కెపూర్‌లో మహిళ హత్య

మంథని రూరల్, ఏప్రిల్26: లక్కెపూర్ శివారులో ఓ మహిళ దారుణహత్యకు గురైంది. మంథని సీఐ రాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన మాసు రమాదేవి (36) శుక్రవారం ఉదయం శెట్టిపెల్లికి వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఈ క్రమంలో మంథని మండలం లక్కెపూర్ శివారులో గుర్తు తెలియని మృతదేహం లభ్యంకావడంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సదరు మృతదేహం రమాదేవిదేనని గుర్తించారు. రమాదేవి భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు లక్కెపూర్ గ్రామానికి చెందిన పండుగ మొగిలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉగ్రదాడిని ఉపేక్షించేది లేదు

సుల్తానాబాద్: ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

జూలపల్లి: మండల కేంద్రంలో నివాళులర్పిస్తున్న రఘువీర్‌సింగ్, నాయకులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 26: అమాయక ప్రజలపై ఉగ్రదాడిని ఉపేక్షించేది లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పేర్కొన్నారు. పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను సుల్తానాబాద్‌లో దహనం చేశారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినదించారు. అలాగే బీజేపీ ఇచ్చిన బంద్ పిలుపు మేరకు శనివారం సుల్తానాబాద్‌లో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలను బంద్ చేసి, మద్దతు తెలిపారు. బీజేపీ నాయకులు పట్టణంలో ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినదించారు.

ఉగ్రవాదాన్ని తిప్పికొట్టాలి

జూలపల్లి, ఏప్రిల్ 26: ఉగ్రవాదాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లకండువాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి నివాళులర్పించారు. హిందువులపై దాడులు హేయమని, కేంద్రం తక్షణమే పాక్‌పై బదులు తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విశారపు వెంకటేశం, మాజీ ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశం, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పొలగాని సతీశ్, కన్నం రమేశ్, చొప్పరి శేఖర్, మెండె ఓదెలు, లక్కాకుల శ్రీనివాస్, పూరెల్ల గంగయ్య, ర్యాకం భాస్కర్, నాగగోని శంకరయ్య, లంక తిరుపతి, కొత్త శ్రీధర్, నాయకులు తొగరు శ్రీనివాస్, సిగురు రవీందర్‌రెడ్డి, మేర శ్రీనివాస్, తాజొద్దీన్ పాల్గొన్నారు.

ధర్మారంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

ధర్మారం, ఏప్రిల్26: పహల్‌గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ శనివారం ధర్మారం మండల కేంద్రంలో హిందూ ఐక్యసంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, కిరాణాదుకాణాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. తర్వాత స్థానికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినదించారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

ధర్మారం: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న స్థానికులు

మెరుగైన సేవలందిస్తాం

పెద్దపల్లి, ఏప్రిల్26: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందిదిస్తామని, 1912 టోల్‌ఫ్రీ నంబర్‌తోపాటు కొత్త ఫీచర్ వాట్సాప్ చాట్ బాట్ అందుబాటులోకి తీసుకువచ్చామని పెద్దపల్లి ఎస్ఈ కంకటి మాధవరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు తమ మొబైల్ నుంచి వాట్సాప్‌లో 7901628348 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలాగే టోల్‌ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందవచ్చన్నారు. పలు ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని తెలిపారు.

రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

ఓదెల, ఏప్రిల్ 26: ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే రజతోత్సవ సభకు మండలం నుంచి భారీగా తరలిరావాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసీ గంట రాములుయాదవ్ కోరారు. శనివారం ఓదెలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వరాష్ట్రం కోసం పుట్టిన జెండా, పోరాడి సాధించిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన జెండా బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సభను విజయవంతం చేయడానికి ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున రావాలని కోరారు. ఇక్కడ నాయకులు కనికిరెడ్డి సతీశ్, చింతమొగిలి, పోలోజు రమేశ్, కుమార్, వెంకటస్వామి, పైడి ఉన్నారు.

ఓదెల: మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ రాములు యాదవ్

సమ్మె సక్సెస్ చేయాలి

గోదావరిఖని, ఏప్రిల్ 26: కేంద్రం అనుసరించిన కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను సింగరేణిలో కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని సెంట్రల్ వర్క్‌షాప్ వద్ద జరిగిన యూనియన్ గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లతో బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తున్నదన్నారు. అలాగే మే డేను సింగరేణి వ్యాప్తంగా అన్ని గనుల్లో జరుపుకోవాలని సూచించారు. ఇక్కడ ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వీ రమణ మూర్తి, తదితరులు ఉన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

ఎలిగేడు, ఏప్రిల్26: మండలంలో మంచినీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో భాస్కర్‌రావు జీపీ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్‌లో శనివారం సమీక్షా సమావే శం నిర్వహించారు. మంచినీటి ఎద్దడి నివారణ కోసం ప్రతి మండలానికి కలెక్టర్ లక్ష రూపాయలు మంజూరు చేశారన్నారు. ఇక్కడ ఎంపీడీవో భాస్కర్‌రావు, మిషన్ భగీరథ ఏఈ సంధ్య, గ్రిడ్ ఏఈ శ్రావణి, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ముత్తారం, ఏప్రిల్ 26: ఇప్పలపల్లి (రామకృష్ణాపూర్)లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం దొమ్మటి పద్మ శనివారం ప్రారంభించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ సుగుణ శ్రీనివాస్, మల్లయ్య, ఉప్పు శ్రీనివాస్, సీసీ రాధిక, తదితరులు ఉన్నారు.

మంథనిలోని ఎంపీడీవో, ఈజీఎస్ కార్యాలయ సమీపంలో ఆందోళన చేస్తున్న మహిళలు

ఉపాధి కూలీల కన్నెర్ర

- వేతనాలు తక్కువ ఇస్తున్నారంటూ మంథనిలో ఆందోళన

మంథని, ఏప్రిల్ 26: శ్రమకు తగిన ఫలితం లేదని, మండుటెండలో పనిచేసినా కూలీ డబ్బులు తక్కువగా చెల్లిస్తున్నారంటూ మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు శనివారం మంథనిలోని ఎంపీడీవో, ఈజీఎస్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ చిల్లపల్లి గ్రామంలో మొత్తం 320 మందికి జాబ్ కార్డులు ఉన్నాయని, ఈ ఏడాది కరువు పనికి 80మంది వస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీలకు రోజుకు ₹307 చెల్లిస్తుండగా, తమ ఖాతాలో మాత్రం ₹80 నుంచి ₹120 మాత్రమే పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పెట్టిన కొలతల ప్రకారం పనులు చేస్తున్నా ఐదు వారాలుగా తక్కువ ఎందుకు చెల్లిస్తున్నారని అధికారులను అడిగామని, సమాధానం చెప్పకపోవడంతో ఆందోళనకు దిగినట్లు చెప్పారు. అలాగే ఉపాధి పనిచేయనోళ్లను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశారని ఆరోపించారు. ఎంపీడీవో శశికళ, ఏపీవో సదానందం, ఉపాధి హామీ అధికారులు వచ్చి వారితో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీ వేతనాలతో పాటు పని చేయకుండా ఎవరైనా కూలీ డబ్బులు తీసుకొని ఉంటే విచారణ చేస్తామన్నారు. కూలీ డబ్బులు ₹200 వచ్చేలా చూస్తామని వివరించడంతోపాటు ఆత్మీయ భరోసాలో అనర్హుల పేర్లు తొలగిస్తామని హామీ ఇవ్వడంతో కూలీలు వెనుదిరిగారు.

టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ, కానిస్టేబుల్‌కు పురస్కారం

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్26: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఉపేందర్, కానిస్టేబుల్ సంపత్‌కు అత్యున్నత పురస్కారం లభించింది. శనివారం డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్ వీరికి నగదు రివార్డు అ